నారాయణరావు నాలుగుడబ్బులు చేసుకుందా మనుకున్నాడు. పిల్లలవాడు. అందులో తప్పే ముంది? ఏంలేదు. తిన్నగా వాళ్ళింటికి వెళ్ళేడు.

"ఏమండీ, మీకు కడియంలో భూములున్నాయిటా?" అని అడిగేడు.

"లేకేం ఉన్నాయి" అంది ఆ యిల్లాలు.

"మరి ఈ ఏడు పంటేదీ?"

"ఏం పండలేదుట."

"పండకపోవడ మేమిటీ కడియంలో? చాల్చాలు కరణం తినేసి ఉంటాడు. మీకు ఏడాదికి పాతికబస్తాలు యివ్వాలిగా!"

"అవును – యీ ఏడు యివ్వలేదు"

"ఉండండి వాడిపని చెబ్తాను." ఆవిడ ఏమీ అనలేదు. ఆ మరునాడు ఈయన సొంతఖర్చు పెట్టుకుని కడియం వెళ్ళేడు. "వెంటనే వెళ్ళి యింతో అంతో యిచ్చుకో, లేకపోతే నిన్ను తోసేస్తారుట" అని కరణాన్ని హడలుగొట్టేడు.

ఎనభై పల్సురేటుతో కరణం మర్నాడు వీళ్ళింట్లో ప్రత్యక్షం!

"పిల్లలవాడ్ని. ఈ ఏడు పండలేదు, పూర్తిగా ఇచ్చుకోలేను" అని ఆయనతో అన్నాడు. "దానికేముగదండీ, ఇబ్బందులు ఎవరికేనా వస్తాయి ఏమేనా కావలిస్తే చేబదులు తీసుకు వెళ్ళండి" అన్నాడు ఆ అతిమంచి యింటి యజమాని.

నారాయణరావు అనుకున్న దేమిటి, వచ్చిం దేమిటి?

* * *

ఆది, అంతం ఒకొక్కప్పుడు ఒక్కలాగే కనిపించవచ్చు. ఉదయమూ, సాయంకాలమూ ఆకాశం ఎర్రగా ఉండవచ్చు. తాతా మనవడూ నీడలు చూసుకోవచ్చు. కాని చూసుకుంటే, ఆలోచిస్తే అంతా అయోమయంగా కనపడుతుంది. దేనికి ఏది మొదలు? ఈ సంఘటనకి ఎలాంటి అంతంఉంటుంది? ఈ ప్రశ్నలకి జవాబులులేవు. ఉంటే కోతులకి రాజయోగం, బుద్ధిమంతులు నిరుపయోగం జరగదు. అజ్ఞానులకి ముందడుగూ, పండితుల పప్పులో అడుగూ జరగదు. అనుకున్నవి అనుకున్నట్టే జరుగుతే ఇన్ని షార్ట్ స్టోరీస్ రాయలేము, నిజం.

స్కెచ్

# మనిషి – కోతి

నిట్టల శ్రీరామమూర్తి

శంకరంగారి ఇంటిముందు ఓ చిన్న గుంపు పోగైవుంది. అంతా చుట్టూచేరి నవ్వులూ వెకవెకలూ, పకపకలూ, చప్పట్లూ ఏవిటీ కోతి చేష్టలూ వీళ్ళూనూ అని చూద్దునుగదా నిజంగా ఆ గుంపుమధ్య ఓ కోతే వుంది. దానిమొలకి తాడుకట్టి ఆడిస్తున్నాడు ఆ సాయిబు. ఆ కోతి అమెరికన్ జాకెట్టులాంటి ఓ రంగుగళ్ళ చొక్కా తొడుక్కుంది—కాలేజీ స్టూడెంటని భ్రమపడేరు గనుక!—క్రింద కాకీనిక్కరూ, నెత్తిమీద చిన్న ఎర్రటోపీ, చేతిలో కర్రంబీడీకూడా వుంది. సాయిబు రకరకాలుగా ఆడిస్తున్నాడు. దాని ఆటల్తోపాటు వాళ్ళూ ఆడుతున్నారు.

శంకరంగారు గచ్చుమెట్లమీద గోడకి జేర్లబడి సావకాశంగా కూర్చున్నారు ఓకాలు సగంమడిచి రెండోకాలు బార్లా జాపుతూ, పంచతొడలపైకి ఎగగట్టివుంది. వంటిని మామూలుగానే చొక్కా లేదు. నోట్లో చుట్ట. అసలు శంకరంగారి రూపు చెప్పాల్సివస్తే ఆయనకీ ఆ కోతికీ అట్టే తేడాలేదు. నా కసలు ఆయనే కోతిక్రిందా, చుట్టుప్రక్కల వాళ్ళు ఆయన్ని ఆడిస్తున్నట్లూ అనిపించింది. ఆ కోతి నవ్వుకీ, దాన్నిచూసి సకిలించే ఆయన నవ్వుకీ ఎంతో సామీప్యం వుంది. అందులో ఆ వేషంలో ఆ పోజులో ఆయన మరీ అల్లా అనిపిస్తున్నాడు. కోతికూడా ఏం తక్కువ చెయ్యటం లేదు. అది ఆయనకేసి తఱచుచూస్తూ ఆయన ఎదురుగానే అన్ని వ్యవహారాలూ చేస్తూంటే (గృహయజమాని కాబట్టి ఆయనముందు సాయిబు చేయిస్తున్నా డనుకోండి) దానికీ ఆయనతోటి బంధువే అనే వూహ కలగడంలో వింతలేదు.

ఏమైతేనేం ఆట జరిగిపోతోంది అత్తగారింట్లో

చెంబెతో నీళ్లు తీసుకురా అంటే డొక్కు విసిరి పారేస్తోంది. పుట్టింట్లో తీసుకురా అంటే టపీమని ఆ డొక్కు నెత్తినిపెట్టుకు తెస్తోంది. బావగారికి మంచినీళ్ళు కావాలిట అంటే డొక్కు అవతల పారేస్తోంది. అన్నయ్య వచ్చేలో కాళ్లు కడుక్కుందికి నీళ్ళిమ్మంటే డొక్కు యిస్తోంది. అంతా నవ్వుతున్నారు దాని చేష్టలకి. ఆఖరికి శంకరంగారి కోడలుకూడా కిటికీ పూచల్లోంచి అల్లా నవ్వుతూంటే నాకు మహా చికాకువేసింది. ఆవిడ ఆ ఇంట్లో చేసే అల్లరి వూళ్ళో అందరికీ తెలుసు అత్తమామల్ని కాల్చుకుతినీ, మొగుడితో నేరాలు చెప్పే, ఆ కోతి చేష్టలకంటే వెయ్యిరెట్లు ఆ ఇంట్లో హంగామా చేస్తోంది. ఆ కోతి చేసే పనులన్నీ తమకంతా క్రొత్త అయినట్లూ, తమంతకుముందేమీ ఎరగనట్లూ, తమేదో పెద్ద బుద్ధిమంతుల్లాగ, వాళ్లంతా అలా నవ్వుతూంటే నాకు చాలా అసహజంగానూ అసందర్భంగానూ అనిపించింది. నిజానికి వాళ్ళ చేష్టలకి కోతే నవ్వివుంటే చాలా సహజంగా ఉండునేమో!

శంకరం, కోడలూ, ఆ జనమూ కాదు సరిగ్గా ఆలోచిస్తే ప్రపంచంలో మానవులం చేసేపలు కోతిపనులుకాక ఇంకేమిటి? డార్విన్ మనపూర్వీకులు కోతులని అన్నాడు కాని మనం ఇప్పటికీ ఇంకా కోతి దశలోంచి పురోగమించలేదనే చెప్పాలి. లేకపోతే క్షణానికో రకంగా స్టేటుమెంట్లుయిస్తూ, నిముషానికో పార్టీమార్చే రాజకీయ ప్రబుద్ధులులంతా కోతికంటే ఏమంత తీసిపోయారు? ఇంక, రోడ్డుమీద ఆడది కనిపిస్తే చాలు లొట్టలేసుకుంటూ వెనకాలే తిరుగుతూ, నర్మోక్తులతో ఆమెను ఏడిపించడానికి ప్రయత్నించే కుర్రాళ్ళు కోతికంటే ఏమంతఎక్కువ?

తెలుగు మేష్టారి పిలకమీద ప్రహసనంచెప్పే కుర్రాళ్ళూ, మారుపేర్లుపెట్టేవారూ, గోడలమీద చిత్రించేవారూ, చేసేచేష్టలు కోతిచేష్టలు కాక మరేమిటి? వేషభాషాచార సంస్కృతుల్లో తెల్లవారిని ఇమిటేట్‌చేసే మనం కోతికంటే ఎక్కువ కదూ? కదుల్తున్న రైలెక్కడం, అమ్మాయిలకోసం ఆలయానికి వెళ్ళటం, చంటిపిల్లల్ని ఏడిపించి ఆనందించటం, అద్దంలో అస్తమానూ తమ ఆకారాన్ని (వికారాన్ని?) చూసుకుంటూ మరిచిపోతూండడం, సినీమాల్లో యీలలూ, కూతలూ, వగైరాలన్నీ కోతిచేష్టలక్రిందే జమఅవుతాయి. మనం ఒక్కసారి ఆకాశంలోకి ఎగిరిపోయి భూమండలం అంతా ఒక్కచూపుతో చూస్తే రోజూ జరిపే మన కార్యకలాపాలన్నీ మంగలి అప్పడి దగ్గిర్నుంచి మహాసంస్థ యు. యన్. ఓ. దాకా అంతా కోతి చేష్టల్లా కనిపిస్తుంది.

ఉప్పుమని ఊదేస్తోంది కోతి బీడీముక్కని. ఈ హుషారులో టోపీతీసేసింది. దాని తలకాయ చూస్తుంటే మావూరి వెంకటేశం జ్ఞాపకం వస్తాడు. ఆ తలకీ ఈతలకీ ఎక్కడా తేడాలేదు. వాడు పట్నంలో చదువు వెలిగించటం మొదలుపెట్టేక క్రాపు బాగా పెంచేడు. తీరా యింటికొచ్చాక పొరపాటున మంగలి అప్పడి చేతిలో పెట్టడం క్రాపు బలిఅయిపోటం జరిగిపోయింది. అందులో అప్పడంటే వాడిచేతుల్లో అప్పగించేవరకు మనయిష్టం కాని ఆ తర్వాత వాడో ఫక్తు డిక్టేటరు. వాడు ఎలాచెప్పితే అలా వినాల్సిందే. వెంకటేశు అప్పటికే చాలాఇదిగా ప్రాధేయపడ్డాడు ఆట్టే తగ్గించకుగాఅని.

"అజెంటయ్యా, నా చిన్నప్పట్నించీ నీకు చేస్తున్నాను. నాకుచెప్తావుటయ్యా" అని గదిమేశేడు. అప్పుడు చెక్కితే మరి నాలుగు నెలలదాకా తిరుగులేదు. ఇంతలో సాయిబు డొక్కు చప్పుడుచేసుకుంటూ డబ్బులకోసం నాదగ్గరకొచ్చేసరికి నాఆలోచనలు ఆగిపోయాయి.

శంకరంగారు మోచేతులుదిగి మణికట్టుకు దూరంగానిల్చేచేతులుగల చొక్కాతొడుక్కుని కొంచెం ముందుకువంగి నడుస్తూ వస్తూంటే "అయ్యో సాయిబేమయిపోయాడు కోతివక్కటే ఇలా వచ్చేస్తోందే, టోపీ ఏం చేసుకుందో" అనే భ్రమ వెంటనే ఎదుటివార్కి కలిగి తీరుతుందనడంలో సందేహం ఎంతమాత్రమూలేదు. ఇంతకీ ఆయన్ని అనాల్సిన పనిలేదు. ఆ చొక్కాకుట్టిన మాస్టర్ టైలర్ తిమ్మారావుకి (అమెరికన్ డిప్లమా హోల్డరు) చెందుతుంది ఆ ఖ్యాతి అంతా.

సాయబూ, కోతీ, ఇంటింటిముందూ ఆడుతున్నారు. అందర్నీ ఆడిస్తున్నారు. నాకునిక్కచే అనిపిస్తుంది-ఎవరు ఎవర్ని ఆడిస్తున్నారని! ★